
హైదరాబాద్ నుండి యర్రవంకపల్లెకు ప్రయాణం కలిగినప్పుడే అనుకున్నాను పల్లెటూరి వాతావరణం కళ్ళారా చూసే భాగ్యం కలిగిందని. పల్లెటూరివాళ్లు కల్లాకపటం లేనివారని, అసూయ ద్వేషాలు వాళ్ళలో మచ్చుకు కూడా వుండవని విన్నాను. ఈనాడు ప్రత్యక్షంగా చూడబోతున్నాను.

బస్సుదిగి కొంత దూరం నడిచి ఊళ్లోకి వెళ్ళాను. ఆ ఊరు నా జన్మ స్థానమే అయినా నేను చిన్నగా వున్నప్పుడే ఊరు వదలి హైదరాబాద్‌లో స్థిరపడిపోయిన నా తల్లిదండ్రులతో వుండిపోవడం వల్ల నా మిత్రుడు జయరాం ఇల్లు కనుక్కోడానికి వీళ్ళను వాళ్ళను అడగవలసి వచ్చింది. ఎన్నో ఏళ్ల తరువాత ఆకస్మికంగా నన్ను చూడ్డంతో "ఎప్పుడు వచ్చావోయ్, ఉత్తరం ముక్కయినా రాయకుండా ఊడిపడ్డావే!" అన్నాడు సంతోషంగా నా మిత్రుడు జయరాం.

నన్ను తన శ్రీమతికి పరిచయం చేశాడు. నేను కాళ్లుముఖం కడుక్కొని డ్రాయింగు రూంలో కుర్చీలో కూచునే సరికి కాఫీ తెచ్చి ఇచ్చింది ఆమె. కాఫీతాగుతూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నాము. భోంచేసి పడుకొనే సరికి రాత్రి పది గంటలయింది. నాకు వరండాలో మంచం మీద పక్కవేసి వాళ్ళు ఇద్దరు లోపల పడుకున్నారు.

* * *

తలుపు తీసిన శబ్దం విని చూశాను. నా మిత్రుని భార్య గిరిజమ్మ నా మంచానికి దగ్గరగా నిల్చుని నావేపు చూస్తున్నట్టు మసకవెల్తుర్లో గమనించాను. మాంచి నిద్ర సమయంలో, పడుకున్న గదిలో భర్తను వదలి ఒంటరిగా వరండాలోకి ఎందుకు వచ్చిందో, నా వేపు తదేకంగా ఎందుకు చూస్తూందో నాకు అర్థం కావడంలేదు. గోడ గడియారం పదకొండు కొట్టింది. ఏవేవో ఆలోచనలు, సంఘటనలు మనసులో మెదిలాయి. జయరాం లేచి ఇక్కడికి వస్తే ఏమనుకుంటాడోనన్న ఆలోచనతో నా మంచం కింద భూమి కంపించినట్టయింది. 'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః' అన్నారు పెద్దలు. మరి ఈమె ఏం ప్రళయం తెచ్చిపెడుతుందో? మెల్లగా నా తల దగ్గరకు వచ్చి నా ముఖంలోకి చూడసాగింది. నా గుండె కొట్టుకోవడం నాకు స్పష్టంగా వినిపిస్తూంది. చేయరాని పని ఏదో చేయబోతున్నట్టు ఊహించాను. 'ఈమె ఏదో అనర్థం తెచ్చిపెట్టేలా వుంది. అనుకోరాదు కాని, ఒకవేళ ఆమె నన్ను అక్రమ చర్యకు ప్రేరేపిస్తే...? ప్రే... రే...పి...స్తే...? ఏం... చేయాలి...? అంగీకరిస్తే మిత్రద్రోహం...! నిరాకరిస్తే...? ఆడవాళ్లు ఎంతకయినా తెగిస్తారట...! చిత్రాంగి ఏం చేసింది...? భర్తను నమ్మించి సారంగధరుని కాళ్ల చేతులు... అబ్బ...



# నేనూ ఓ కాకిని

—వై.సి.పి. వెంకటరెడ్డి

అనుకుంటే భయంగా వుంది...!'...నావేపు చూస్తూ మెల్లగా బయటికి వెళ్లిపోయింది ఆమె. 'హమ్మయ్య! గండం గడచిపోయింది' అనుకొని హాయిగా గాలి పీల్చుకున్నాను.

నాకు ప్రమాదం తప్పిందని సంతోషించామకాని,

ఆమె ఈ అర్ధరాత్రి సమయంలో బయట! ఎందుకు వెళ్ళింది అనే సందేహం కలిగింది. రీసెస్‌కు ఏమయినా వెళ్ళిందా?...... అయితే నావేపు అంత పరిశీలనగా మాడవలసిన అవసరం ఏం వుంది? ...మొత్తానికి ఏదో బలీయమయిన కారణం వుండవచ్చు... ఆమె ఎవరితోనైనా అక్రమ... ఛ ఛ!! మనసు కోతిలాంటిదని అందుకే అన్నారు కాబోలు!

ఇంతలో తలుపు తట్టిన శబ్దంతోబాటు ''పుల్లమ్మా'' అనే పిలుపు వినిపించింది.

ఆ పుల్లమ్మ ఎవరో, ఇంత రాత్రివేళ ఆమెను లేపవలసిన అవసరం ఏమిటో నాకుతోచలేదు. ఏమయితే నాకు ఎందుకులే అని సరిపెట్టుకుందామనుకుంటే మనసు వుండనిస్తేగా! వాళ్ళ మాటలు వింటే విషయం అర్థం అవుతుందని శ్రద్ధగా వినసాగాను.

''ఇప్పుడయినా నమ్ముతావా?'' అంది గిరిజమ్మ.

''అదే నేనూ చూస్తున్నా'' అంది ఆమె.

''ఏం చూస్తున్నావ్?''

''అదే నాగరత్న ఇంటిలో జరుగుతున్న తతంగం.''

''అయితే నీవూ నిద్రపోలేదన్న మాట?''

''నిద్ర ఎలా వస్తుంది?''

వాళ్ళ సంభాషణ వింటూంటే ఆ నాగరత్న ఎవరో, ఆమె ఇంటిలో జరుగుతున్న తతంగం ఏమిటో, వీళ్లకు నిద్ర ఎందుకు రాలేదో తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఎక్కువయింది.

''ఏం చేద్దామంటావ్?'' అంది గిరిజమ్మ.

''మరి కొంతమందిని పోగుచేసుకుంటే బావుంటుంది!''

''హంగామా చేస్తే మీ ఆయన ఏమీ అనరా?''

''తెల్లవారే వరకు ఆయన లేస్తేగా?'' అని

''కాస్త మెల్లగా మాట్లాడు, మా వరండాలో మా బంధువు ఒకాయన పడుకున్నాడు'' అంది మెల్లగా.

నా వేపు అంత పరిశీలనగా ఎందుకు చూసిందో ఇప్పుడు అర్థమయింది.

క్షణాల్లో ఇరుగు పొరుగు వాళ్ళంతా గుమిగూడారు.

''ఇలాంటి వాళ్ళు మన వీథిలో వుంటే వీథిలో వాళ్ళందరి పరువు మంటగలుస్తుంది.

ఇదేం సంసారులుండే బజారా, సానులుండే బజారా?''

''ఇలాంటివాళ్లను చూసి ఇంకా ఎంతమంది తయారవుతారో?''

''బంగారమ్మకు చెప్పి తక్షణం ఇల్లు ఖాళీ చేయించాలి.''

''అవును. చేయించాల్సిందే!''

ఇలా సాగిపోతూంది వాళ్ళ సంభాషణ. ఆ నాగరత్న ఎవరో తెలియకపోయినా, ఆమె ఇంటిలో జరగరాని పని ఏదో జరుగుతున్నట్టు గ్రహించగలిగాను.

''ఇప్పుడే వెళ్దాం పదండి!'' బిగ్గరగా అంది గిరిజమ్మ.

నేను వరండాలో పడుకున్నానన్న సంగతి మరచిపోయింది కాబోలు ఆవేశంలో!

''ఎక్కడికి?'' అడిగింది ఒకామె.

''బంగారమ్మ ఇంటికి'' అంది గిరిజమ్మ.

''ఊహుఁ.నాగరత్న ఇంటికి వెళ్ళడమే మంచిది.''

''ఎందుకు?''

''మన అనుమానం అనుమానమేనా లేక వాస్తవమా అని తెలుసుకోడానికి.''

''ఇంకా అనుమానమా?'' అంది గిరిజమ్మ.

మరికొంతసేపు తర్క వితర్కాలు చేశారు.

''ఇంట్లో మాట్లాడేది ఆమె మగడు కాదని నీకు ఎలా తెలుసు?'' ధర్మసందేహం వెలిబుచ్చింది ఓ బుద్ధిమంతురాలు.

''అవును మరి. ఇంట్లో వుండేది ఆమె మగడే కావచ్చుగా?'' అంది మరో ఆమె.

''కాదు, ఆమె మగడు కానేకాదు'' అంది గిరిజమ్మ.

''అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?''

''స్టాట్ వ్యాల్యుయేషన్‌కు వెళ్లాడని, పది రోజులు అక్కడే వుంటాడని ఆమె చెప్పింది.''

''మళ్ళీ రావచ్చుగా?''

''ఎందుకు వస్తాడు?''

''ఆయన వెళ్ళవలసిన బస్సో, రైలో మిస్ అయితే ఎందుకు రాకూడదు?''

ఎవరెవరికి తోచినట్టు వాళ్లు మాట్లాడుతున్నారు.

''ఇంట్లో మాట్లాడేది ఆమె భర్త కాదని ఖచ్చితంగా చెప్పగలను'' అంది గిరిజమ్మ.

''అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?''

''గొంతు గుర్తించలేవా?''

''ఎవరయితే మనకేం!'' అంది ఓ గొంతు.

''ఆ! భలేవారే, అలాంటివారిని చూసి మన ఇళ్ళల్లో వయసొచ్చిన పిల్లలు పెడ్డ తిరుగుళ్ళు తిరగరా?'' అంది గిరిజమ్మ.

''అసలు మన మగవాళ్ల మీద కన్ను వెయ్యదని గ్యారంటీ ఏమిటి?'' అంది పుల్లమ్మ.

''సాటి ఆడదాన్ని అంత చులకనగా మాట్లాడ్డం మంచిదా?''

''కాలేజిలో చదువుకొనేదానివి నీకేం తెలుస్తాయి పార్వతీ ఇక్కడి పరిస్థితులు?'' అంది గిరిజమ్మ.

''నా మొగుణ్ణి నాగరత్న వలలోపడనీకు తండ్రీ అని రోజూ దేవుని వేడుకుంటాను'' అంది పుల్లమ్మ.

''నీ మొగుడు బుద్ధిమంతుడైతే ఆమెవలలోఎందుకు పడతాడు?'' అంది ఆ అమ్మాయి.

''మగవానిదేముంది, ఆడది ఎలా ఆడిస్తే అలా ఆడతాడు.''

''మగవాళ్లంతా ఆడవాళ్ళ చేతి కీలుబొమ్మలనా నీ అభిప్రాయం?''

ఆ హడావుడికి కుక్కలు మొరగసాగాయి. వాద వివాదాలు, తర్క వితర్కాలు, గుసగుసలు సాగుతున్నాయి.

''వెళ్దాం పదండి!'' అంది గిరిజమ్మ.

''వెళ్ళి ఏం చేద్దాం?'' అంది ఒకామె.

''బుద్ధి చెబుదాం!'' అంది పుల్లమ్మ.

''నా ఇష్టం, మీ రెవరు అడగడానికి -అంటే?''

''అనవసరమయిన గొడవ కదా?''

''వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ఏం బావుంటుంది?''


''ఎవరో ఏదో చేస్తే మనకు ఏం నష్టం అని అందరూ ఇలా ఉదాసీనంగా వుండబట్టే కొంతమంది బరితెగించి పోతున్నారు'' అంది గిరిజమ్మ.

-కలకలం మరీ ఎక్కువయింది. ఉన్నట్టుండి విద్యుద్దీపాలు హరీ అన్నాయి. గిరిజమ్మ ఆదరా బాదరా ఇంట్లోకి వచ్చి చీకట్లో కొంచెం సేపు తారాడింది. అగ్గిపుల్ల గీసి లాంతరు వెలిగిస్తుండగా కరెంటు లైట్లు వెలిగాయి. మళ్లీ బజార్లోకి వెళ్ళింది.

ఏం చేద్దామంటే ఏం చేద్దాం అని అనుకున్నారు.

''మగవాళ్ళతో సంప్రదించడం మంచిది'' అని ఎవరో సలహా ఇచ్చారు.

''ఏం కొంపలు తగలబడిపోతున్నాయని నిద్రబోయే వాళ్ళని లేపాలి?'' అన్నారు కొంతమంది.



గిరిజమ్మ విసవిసా ఇంటిలోకి వచ్చింది. ఏం చేస్తుందోనని జాగ్రత్తగా గమనిస్తున్నాను. నిద్రపోతున్న భర్త వీపు తట్టింది. హడావుడిగా లేచి మంచం పక్కనే వున్న కర్ర తీసుకొని గజగజ వణుకుతూ, "ఏదీ ఎక్కడ? ఎక్కడ?" అని తడబడుతూ అడిగాడు జయరాం.

సంగతేమిటో తెలుసుకోకుండా హడలిపోతున్న భర్తను చూసి నవ్వుతూ కొంపలేమీ మునిగిపోలేదని, బంది పోటు దొంగలు అసలు రాలేదని, కంగారుపడవలసిన అవసరం ఏమీ లేదని ధైర్యం చెప్పింది గిరిజమ్మ.

"మరి ఎందుకు లేపావే?" అన్నాడు.

విషయమంతా విపులంగా చెప్పింది.

"ఎవరు ఏ బావిలో దూకి చస్తే మనకేమే!" అన్నాడు జయరాం బద్ధకంగా ఆవులిస్తూ.

"ఆ ఉదాసీనతే వద్దన్నాను."

"మరి ఇప్పుడేం చేద్దామంటావ్?"

"ఇప్పుడే వెళ్ళి దులిపేద్దాం!" అంది ఆవేశంగా.

"ఇతరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడానికి మనకేం హక్కుంది!"

"ఇతరులకు ఇబ్బందికలిగే పనులు చేస్తే ఎందుకు జోక్యం చేసుకోకూడదు?"

"అయితే నీ ఇష్టం."

"నా ఇష్టమేంటి మీ ముఖం! మీకు స్వంత అభిప్రాయమంటూ లేదా?"

"ఉండేది ఒకప్పుడు".

బయట గోల ఎక్కువయింది.

"ఏమిటా గోల?" అడిగాడు జయరాం.

"అదే, నాగరత్న గోల."

"అంటే?"

"రామాయణం విని సీతకు రాముడు ఏమవుతాడు అన్నట్టుంది మీ వాలకం. మన బజారు వాళ్ళంతా కలిసి నాగరత్న ఇంటి మీదికి దండెత్త బోతున్నారు" అంది ఉత్సాహంగా.

"గుట్టుగా బతికే మగవాళ్ళి రట్టుకు తేవడం ఏం బావుంటుంది?"


"ఏం గుట్టండి! మగడు లేనప్పుడు పరాయి మగ వాడితో కులకడం గుట్టా? అదీ ఒక మగనాలేనా?" అంది మండిపడుతూ.

ఇంతలో ఆడా మగా కలిసి ఓ పాతిక మంది జయరాం ఇంటిముందు చేరారు. వాళ్ల సంభాషణబట్టి చూస్తే నాగరత్న ఇంటికి వెళ్లే విషయంలో మగవాళ్లకంటే ఆడవాళ్లే ఎక్కువ ఆసక్తిగా వున్నట్టు తోస్తోంది.

నాగరత్నకు బుద్ధి చెప్పాలని కొందరంటే, ఇల్లు ఖాళీ చేయించాలని మరి కొందరన్నారు. ఈ బజార్లోనే వుండనివ్వకూడదు అని కొందరంటే, ఈ ఊళ్లోనే వుండనివ్వకూడదు అని మరికొందరు అన్నారు.

ఆఖరుకు అందరూ ఒకే నిశ్చయానికి వచ్చి నాగరత్నమ్మ ఇంటికి వెళ్లడానికి బయల్దేరారు.

నేనూ వాళ్ళ వెంట వెళ్ళి గిరిజమ్మ, పుల్లమ్మ అంటున్నది వాస్తవమా లేక ఆరోపణ మాత్రమేనా అన్న




విషయం ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. అయినా కొత్తవాణ్ణి వాళ్లవెంట వెళ్లడం బావుంటుందో లేదో అనే అనుమానం నా కుతూహలాన్ని అణచివేసింది.

వెళ్తూ వెళ్తూ, " ఇంత గోల జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు నిద్రబోతున్నావటోయ్?" అన్నాడు మిత్రుడు జయరాం.

"లేదు!" అంటూ లేచి కూర్చున్నాను.

"అయితే అంతా వింటూనే వున్నావన్నమాట!" అన్నాడు.

"ఇప్పుడిప్పుడే మెలకువ వచ్చింది" అన్నాను.

"నీవూ వస్తావా?" అన్నాడు.

"ఎక్కడికి?" అన్నాను ఏమీ తెలియనట్టు.

" నా వెంట రావయ్యా చెబుతాను."

"సరే పద!" అంటూ షర్టు వేసుకొని బయల్దేరాను.

నాగరత్నమ్మ ఇల్లు ఎక్కడో దూరంగా లేదు. జయరాం ఇంటికి చాల దగ్గరలోనే వుంది. జయరాం ఇంటి ముందు నిల్చుంటే అక్కడ ఏం జరిగేదీ స్పష్టంగా కనిపిస్తుంది. అయినా దగ్గర్లో వుంటే కనిపించడమే కాక మాటలూ వినిపిస్తాయి అనే ఉద్దేశంతో వాళ్ళ వెంట వెళ్ళాను. వాళ్ళ వెంట వెళ్లడం మంచిది కాదని వివేకం ఓ వైపు ఎంత వారిస్తున్నా, మానవ సహజమయిన కుతూహలం నన్ను అక్కడికి లాక్కువెళ్ళింది.

నాగరత్నమ్మ ఇంటిలో లైటు వెలుగుతోంది. రేడియో మంచో లేక టేపురికార్డరు మంచో పాటలు వినిపిస్తున్నాయి.

"ఇంట్లో లైటు వెలుగుతూనే వుందే!" భావగర్భితంగా అంది ఒకామె.

"గిరిజమ్మ మాటలు నమ్మడానికి వీలుందా?" సందేహం వెలిబుచ్చింది మరొకామె.

"ఎందుకు లేదు?" అంది పుల్లమ్మ.

"అంత వెల్తుర్లో..." నసిగింది ఓ వృద్ధురాలు.

"వెల్తురూ గిల్తురూ సంసార్లకు... ఎగ్గూ సిగ్గూ వదులుకున్న రంకు ముండ..." అంది గిరిజమ్మ.

ముఖం తిప్పుకొని గిరిజమ్మ ధోరణి పట్ల అసమ్మతి తెలియజేసింది ఓ అమ్మాయి. కాలేజిలో చదువుతూంది ఈ అమ్మాయే కాబోలు అనుకున్నాను.

నిశ్శబ్దంగా వుండమని ఒకరి కొకరు సైగ చేసుకున్నారు.

అందరూ నిశ్శబ్దంగా వుండిపోయారు.

ఏం జరుగుతుందోనని ఆతురతగా చూస్తున్నాను.

ఇంటిలో నుండి మాటలు వినిపిస్తున్నాయి. మధ్య మధ్యలో నవ్వులు కూడా వినిపిస్తున్నాయి. వాళ్ల అంటున్నట్టు పరాయి మగవాడయితే నిర్భయంగా అంత బిగ్గరగా మాట్లాడతారా అనే సందేహం కలిగింది. నా సందేహం పసికట్టినదానిలా "భోగంవాళ్లు కూడా ఇంత నిర్భయంగా మాట్లాడరే!" అంది ఒకామె.

"భోగంవాళ్ల కంటే బరితెగించిన ఆడది..." అంది గిరిజమ్మ కర్కశంగా.

"నీ మాటలు నమ్మడానికి వీల్లేదు" అంది ఓ గొంతు.

"గిరిజమ్మ ఏదో కసితో అంటున్నట్టుంది. ఇంట్లో వుండేది పరాయి మగవాడు కానేకాదు." మగవాళ్లంతా ఒకే అభిప్రాయం వెలిబుచ్చారు.

నాకూ అలాగే అనిపించింది. ఎంత బరితెగించినా లోకానికి భయపడరా? మాంసం తింటామని ఎముకలు మెడలో వేసుకుంటారా ఎవరయినా?

"తినబోతూ రుచి అడగడం ఎందుకు?" అన్న గిరిజమ్మ మాటతో నా ఆలోచనలకు అంతరాయం కలిగింది.

ఏమని పిలవాలి, ఎలా పిలవాలి -ఎవరు పిలవాలి - ఈ వేళప్పుడు ఇంతమంది ఎందుకు వచ్చారంటే ఏం జవాబు చెప్పాలి -అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. పిల్లి మెడలో గంట కట్టాలని అన్ని ఎలుకలు కలిసి నిర్ణయించుకున్నాయి. అయితే గంట కట్టడానికి ఏ ఎలుకా సిద్ధంగా లేదు.


గుంపులో గోవింద అంటే ఇదే కాబోలు అనుకున్నాను.

''అందరూ వెళ్లి ఏమీ తెలియనట్టు అక్కడొకరు ఇక్కడొకరు వుండండి. నాగరత్నను నేను పిలుస్తాను. జరిగే తమాషా చూద్దురుగాని!'' అంది గిరిజమ్మ.

హిప్నటిజం ప్రభావానికిలోనయిన వాళ్లలాఅందరూ అంగీకరించారు. నేను ఏదో అనాలని అనుకున్నాను. అయితే అనలేక పోయాను. అయినా ఎందుకయినా మంచిదని నాగరత్నమ్మ ఇంటికి ఎదురుగా ఓ అరుగు మీద వతికిలపడి ఆకాశం కేసి చూడసాగాను.

తలుపు మీద వేళ్లతో టకటక శబ్దం చేసింది గిరిజమ్మ.

గుసగుసలు మానివేసి నిశ్శబ్దంగా ఆ వేపే చూడ సాగారు అందరూ. ఏం కొంపలు మునుగుతాయోనని నా గుండె గుబగుబ లాడుతూంది. జరగకూడనిది ఏదయినా జరిగితే...? అందరితోబాటు నేనూ ఎందుకు వచ్చినట్టు...? ఆడవాళ్లు పొద్దుపోక ఏదో ఆరోపిస్తే చదువుకున్న వాడివి నీవు ఎందుకు వెళ్లావ్ అని తెలిసిన వాళ్లు ఎవరయినా అడిగితే...! ... జయరాం తప్ప నాకు తెలిసిన వాళ్లు ఎవరున్నారు ఈ ఊళ్ళో...! నీవు ఇంటిలో లేనప్పుడు ఇలా. నీ భార్యను ఎవరయినా అను మానించి అవమానిస్తే... ఎవరో నిలదీసి అడుగుతు న్నట్టు అనిపించి అదిరిపడ్డాను. అవును మరి... నాగరత్నమ్మ నా భార్యలాంటి స్త్రీకాదా? ఇక్కడి నుండి లేచి వెళ్లడం మంచిది అనుకొని నేను అరుగు మీది నుంచి కిందికిదిగడము, నాగరత్నమ్మ తలుపుతీయడము ఒకేసారి జరిగాయి.




''ఏం గిరిజా ఇలా వచ్చావ్?'' ఆప్యాయంగా పలక రించింది నాగరత్నమ్మ.

''అమృతాంజనం ఉందేమో నని!''

''రా, కూచో...!'' అంటూ లోపలికి వెళ్లింది నాగరత్నమ్మ.

''రండి!'' అంటూ లోపలి నుంచి వచ్చిన పురుషుని చూసి అంతరిక్ష యాత్రచేసి సురక్షితంగా తిరిగి వచ్చిన అంతరిక్ష యాత్రికుని ముఖంలా వికసించింది గిరిజమ్మ ముఖం.

అతడు నాగరత్నమ్మ భర్త కాదని గిరిజమ్మ ముఖ కవళికలను బట్టి గ్రహించగలిగాను.

''ఇదో అమృతాంజనం''అంటూ నాగరత్నమ్మ చెయ్యి చాచడం, ఏదో అనడానికి గిరిజమ్మ నోరు తెరవడం, ''ఎప్పుడొచ్చావోయ్ సుందరం!'' అంటూ జయరాం ముందుకు రావడం ఒకేసారి జరిగాయి.

''నేను వచ్చి అర్థగంటయింది'' అన్నాడు సుందరం.

''పగలు రాలేకపోయావా?''

''టెలిగ్రాం చేరిన వెంటనే బయల్దేరి వచ్చాను.''

''టెలిగ్రాం ఏమిటి?''

''మీ బావ స్పాట్ వ్యాల్యుయేషన్‌కు వెళ్తున్నారు, వెంటనేరమ్మని మా చెల్లాయి టెలిగ్రాం ఇచ్చింది.''

''మీ చెల్లాయి ఇక్కడ వున్నట్టు ఎప్పుడో చెప్పినట్టు జ్ఞాపకం.''

''మీరుఇంతసేపు మేలుకున్నారెందుకు?'' అడిగాడు సుందరం.

నన్ను చూస్తాడేమోనని నక్కి కూచున్నాను.

జయరాం కాస్త తటపటాయించి, ''ఏదో లోకులు ...'' అని ప్రారంభించి మాట స్పష్టంగా రాక నసుగు తుండగా, '' తలనొప్పిగా వుంటే అమృతాంజనం కోసం ఒంటరిగా రాలేక నేనే పిలుచుకొని వచ్చా అన్నయ్యా!'' అంది గిరిజమ్మ ఏమాత్రం వెనుకముందు లాడకుండా.

ఆమె సమయస్ఫూర్తికి ఆశ్చర్యపోయాను. ''లోకులు కాకులు'' అనబోయాడు అనుకుంటాను జయరాం. అవును కాకులే మరి! ఆ కాకుల్లో నేనూ ఓ కాకిని!


## జాతీయ భాషాసమైక్యతా గ్రంథములు ◆ సాంకేతిక విజ్ఞాన గ్రంథములు

| | | | |
|---|---|---|---|
| 30 రోజులలో | తమిళ భాష | వెల రూ. | 7.50 |
| ,, ,, | హిందీ భాష | వెల రూ. | 7.50 |
| ,, ,, | కన్నడ భాష | వెల రూ. | 8.00 |
| ,, ,, | మలయాళ భాష | వెల రూ. | 7.50 |
| ,, ,, | సంస్కృత భాష | వెల రూ. | 7.00 |
| ,, ,, | ఆంగ్ల భాష | వెల రూ. | 12.00 |
| ,, ,, | ఉర్దూ భాష | వెల రూ. | 8.50 |
| ,, ,, | మరాఠి భాష | వెల రూ. | 8.50 |
| ,, ,, | బెంగాలీ భాష | వెల రూ. | 4.50 |
| ,, ,, | పంజాబి భాష | వెల రూ. | 6.00 |
| ,, ,, | గుజరాతి భాష | వెల రూ. | 5.50 |
| | ఆంగ్ల సంభాషణము | వెల రూ. | 7.30 |
| | బాలాజీస్ ఈసి వే టు స్పీక్ ఇంగ్లీష్ | వెల రూ. | 19.75 |

పైకనుబరచిన పుస్తకములన్నీ తెలుగుమూలంగా ఇతర భాషలను వ్యాకరణ రీతిగా వ్రాయుటకు, చదువుటకు, మాట్లాడుటకు, వుపకరించు గొప్ప గ్రంథములు. పుస్తకమును కొనదలచేవారు పుస్తకము వెలతో రూ. 5.50 చేర్చి M.O. పంపండి.

| | | |
|---|---|---|
| ట్రాన్సిస్టర్ రేడియో | వెల రూ. | 5.75 |
| ట్రాన్సిస్టర్ రిపేరింగ్ | వెల రూ. | 5.75 |
| హౌస్ వైరింగ్ | వెల రూ. | 8.50 |
| మోటార్ రీవైండింగ్ Part I | వెల రూ. | 11.50 |
| మోటార్ రీవైండింగ్ Part II | వెల రూ. | 15.00 |
| T.V. మెకానిజం | వెల రూ. | 15.00 |
| టేప్ రికార్డర్ | వెల రూ. | 8.75 |
| మోటార్ మెకానిజం | వెల రూ. | 8.75 |
| రెఫ్రిజిరేషన్ & ఎర్‌కండిషన్ | వెల రూ. | 8.75 |
| మోడరన్ ఫోటోగ్రఫీ | వెల రూ. | 18.50 |
| లేత్ వర్క్స్ | వెల రూ. | 6.75 |
| గ్యాస్ & ఆర్క్ వెల్డింగ్ | వెల రూ. | 7.50 |
| మెటల్ & షీట్‌మెటల్ | వెల రూ. | 6.25 |

పై కనుబరచిన పుస్తకములన్నీ స్వయముగా తయారుచేసు కొనుటకు వాటిలో రాగల చిక్కులను రిపేరు చేసుకొనుటకు ఆయా భాగముల పటములతో అతి సులభముగా అర్థమగునట్లు వివరించబడి యున్నవి.

BP
# BALAJI PUBLICATIONS
103, PYCROFTS ROAD MADRAS-600 014